క్లుప్తంగా

పారిశుధ్యం అధ్వానం



నాగులపల్లి ప్రధాన రహదారిలో పారుతున్న మురుగు నీరు

కొత్తపల్లి: మండలంలోని నాగులపల్లిలో పారిశుధ్యం క్షీణించి స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. చిన్న వర్షానికే వీధుల్లో నీరు రోడ్లపైకి వచ్చి చేరుతోంది. దీంతో దోమలు వృద్ధి చెంది రోగాలకు కారణమవుతున్నాయి. పాఠశాలలు, అంగన్‌వాడీ భవనాల సమీపంలో చెత్త పేరుకుపోతోంది. దీంతో విద్యార్థులు, చిన్నారులకు ఏ అంటు రోగాలు వస్తాయోనని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. పంచాయతీ అధికారులతో ఎన్నిసార్లు మొరపెట్టున్నా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి ప్రజలను దోమలు, రోగాల బారి నుంచి రక్షించాలని కోరుతున్నారు.

మట్టి గణపతితో పర్యావరణ పరిరక్షణ



పిఠాపురంలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

పిఠాపురం: మట్టి వినాయకుడిని పూజిద్దాం–పర్యావరణాన్ని కాపాడుకుందాం అని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు గురువారం పిఠాపురంలో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. వినాయక చవితిని పురస్కరించుకుని ఈ మేరకు ప్రజలు అవగాహన కల్పిస్తూ ప్రచారం చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సుభాషిణి జల కాలుష్యాన్ని నివారించేలా రంగులు గానీ, ప్లాస్టర్ ఆఫ్ పారిస్ గానీ లేకుండా మట్టి వినాయకుడిని పూజించాలని సూచించారు. అనంతరం వినాయకుని విగ్రహాలను పంచిపెట్టారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె. ఉషశ్రీ, ఆనంద్, కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కక్షసాధింపు చర్యలు తగవు

- కూటమి తీరు మారకపోతే ఉద్యమిస్తాం
- ఎంఆర్పీఎస్ అధ్యక్షుడు కొండేపూడి

కాకినాడ: కూటమి ప్రభుత్వం కక్షసాధింపు చర్యల్లో భాగంగానే బాపట్ల మాజీ ఎంపీ నందిగం సురేష్‌ను అరెస్టు చేసిందని ఏపీ ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కొండేపూడి శ్యాంబాబు విమర్శించారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కక్షసాధింపు చర్యలకు ప్రాధాన్యమిస్తోందని ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రతిపక్ష పార్టీల నేతలపై కేసులు పెట్టడం, దాడులుచేయడం, అరెస్టులు చేయడమే లక్ష్యంగా పనిచేస్తుందన్నారు. ఇందులో భాగంగానే మాజీ ఎంపీని అరెస్టు చేసిందన్నారు. అవసరమైతే వైఎస్సార్ సీపీతో కలిసి మాదిగలంతా ఎమ్మార్పీఎస్ తరఫున ఉద్యమిస్తారన్నరు. మాదిగల మనోభావాలు దెబ్బతినేలా వ్యవహరించవద్దని ఆయన కూటమి ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

విచ్చలవిడిగా పశు సంచారం

- నియంత్రణలో అధికారులు విఫలం
- ప్రమాదాల బారిన వాహన చోదకులు
- వ్యాధుల భయంలో ప్రజలు



సామర్లకోట మఠం సెంటర్‌లో రోడ్డుపై బైఠాయించిన ఆవులు



యార్లగడ్డ అక్కిరాజు మున్సిపల్ హైస్కూల్–పాత సామర్లకోట రోడ్డులో పందులు

సామర్లకోట: ఏ ప్రధాన రహదారి చూసినా పశు సంచారంతో నిండి ఉండి వాటి మధ్య నుంచి వాహన చోదకులు తప్పించుకుని వెళ్తున్న దృశ్యాలే కనిపిస్తున్నాయి. పలు సందర్భాల్లో అవి ట్రాఫిక్ ఇబ్బందులకు, వాహన చోదకుల ప్రమాదాలకు కారణమవుతున్నాయి. స్థానిక స్టేషన్ సెంటర్, గాంధీచౌక్, పాత తహసీల్దార్ కార్యాలయం, బ్రౌన్‌పేట జంక్షన్, సీబీఎం హైస్కూల్ సెంటర్, ప్రసన్నాంజనేయ ఆలయం, మెహర్ కాంప్లెక్స్, మఠంసెంటర్లలో రోడ్ల మధ్య ఆవులు పడుకుని సేదతీరడం సర్వ సాధారణమైపోయింది. పెద్దాపురం మున్సిపాలిటీ పరిధిలో సైతం మున్సిపల్ సెంటర్, మెయిన్ రోడ్డులోనూ ఇదే పరిస్థితి. అధికారులకు ఫిర్యాదులు అందుతున్నా చర్యలు మాత్రం శూన్య

రోడ్లపై పశు సంచారం

పాలు పిండుకోవడం వరకే యజమానుల పని. వాటిని మేపడంపై శ్రద్ధ చూపక రోడ్లపై వదిలేస్తున్నారు. మళ్లీ పాలు ఉత్పత్తి అవ్వాలంటే వాటికి పోషక విలువలున్న గడ్డి చాలా అవసరం. మూగజీవికి ఏం తెలుసు ఇది తినచ్చు.. ఇది తినకూడదని..? రోడ్డుపై గడ్డి మొలవదు కనక వాటికి కనపడిన ప్రతి చెత్తనీ తింటూ కడుపు నింపుకొంటున్నాయి. వాటిలో ప్రమాదకరమైన ప్లాస్టిక్ కవర్లు సైతం ఉండడం గమనార్హం. దీంతో నాణ్యమైన పాల నాణ్యత తగ్గే అవకాశం ఉంది. ఇళ్ల ముందు పురుగు పుట్ర రాకుండే చల్లుకునే కళ్లాపు గతంలో సువాసన వెదజల్లుతూ ఉండేది. ఇప్పుడా పరిస్థితి లేదు. నేడు ఆవు పేడతో చేసిన కళ్లాపు దుర్వాసన వెదజల్లుతోంది.

పందుల స్వైరవిహారం

ఏ వార్డులో చూసినా పందులు స్వైర విహారం చేస్తున్నాయి. ప్రస్తుత వర్షాకాల సీజన్‌లో పందుల సంచారాన్ని నియంత్రించే క్రమంలో వాటి పెంపకందారుల ద్వారా వాటిని దూరంగా తరలిస్తున్నారు. వాటిని కుట్టి దోమలు తమను కుడితే మలేరియా, చికున్‌గున్యా, కలరా వంటి వ్యాధులు వస్తాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆవులు, పందులను రోడ్లపైకి వదలడాన్ని నియంత్రించాలంటే రహదారి నిబంధనలు మీరిన వాహనచోదకులకు పోలీసులు జరిమానా విధిస్తున్నట్టుగా భారీగా వడ్డిస్తేనే మంచిదని ప్రజలు సూచిస్తున్నారు.

ఆవులు, పందుల సంచారాన్ని నియంత్రిస్తాం



ప్రజారోగ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత అందరిపైనా ఉంది. బాధ్యతలు స్వీకరించిన వారం రోజులలోనే ఎక్కడ చూసినా ఆవులు గుంపులుగా ఉండటాన్ని గమనించాను. ఈ మేరకు దండోరా వేయించి ఆవులు, పందులు పెంపకందారులకు హెచ్చరికలు జారీ చేస్తాం. అప్పటికీ పట్టించుకోక పోతే బందిలదొడ్డి పెట్టి అపరాధ రుసం విధిస్తాం. అచ్చట నుంచి గోశాలకు ఆవులను తరలిస్తాం. అలాగే పందుల నివారణకు చర్యలు తీసుకుంటాం.

– ఎ శ్రీవిద్య, మున్సిపల్ కమిషనర్, సామర్లకోట

విశిష్ట ప్రాంతంలో జిల్లా కోర్టు

హైకోర్టు చీఫ్ జస్టిస్ ధీరజ్ ఠాకూర్



పూజలు చేస్తున్న జిల్లా జడ్జి గంధం సునీత

పిఠాపురం: పిఠాపురం ఎంతో విశిష్టత గల ప్రాంతమని, ఇక్కడ జిల్లా కోర్టు నిర్మాణమవడం శుభ పరిణామమని హైకోర్టు చీఫ్ జస్టిస్ ధీరజ్ ఠాకూర్ అన్నారు. ఆయన గురువారం పిఠాపురంలో జిల్లా కోర్టు నూతన భవనాన్ని వర్చువల్ పద్ధతిలో ప్రారంభించారు. వర్చువల్ విధానంలో హైకోర్టు నుంచి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం కోర్టు సముదాయాన్ని జిల్లా జడ్జి గంధం సునీత ప్రారంభించి మాట్లాడుతూ న్యాయవాదులు, పిఠాపురం బార్ అసోసియేషన్ సహకారం మరువలేనిదన్నారు. ఈ సందర్భంగా సర్వమత ప్రార్థనలు చేసి హాలును ప్రారంభించారు. కార్యక్రమంలో 12వ అదనపు జిల్లా జడ్జి వాసంతి, సీనియర్ జడ్జి బాబు, జూనియర్ సివిల్ జడ్జిలు విజయ రామేశ్వరి, వెంకట అపర్ణ, పిఠాపురం బార్ అసోసియేషన్ అధ్యక్షులు మేరుగు రాజారావు, బార్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో గణపతి హోమం

సామర్లకోట: స్థానిక బళ్లమార్కెట్ సెంటర్‌లోని పురాతన గణపతి ఆలయంలో గురువారం గణపతి హోమం నిర్వహించారు. పురాతన ఆలయం కావడంతో దాతల సహకారంతో ఆలయ పునర్నిర్మాణ పనులు చేశారు. ఇందులో భాగంగా హోమం నిర్వహించారు. గణపతి నవరాత్రులను పురస్కరించుకొని పందిరి రాట వేశారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు. పారిశ్రామికవేత్త బోనగిరి సాంబమూర్తి, స్నేహితుల సహకారంతో ఆలయాన్ని అభివృద్ధి చేశారు. ఆలయ కమిటీ నాయకులు భక్తులకు సేవలందించారు.

చురుగ్గా బీజేపీ సభ్యత్వాలు

సామర్లకోట: నియోజకవర్గంలో బీజేపీ సభ్యత్వాలు చురుగ్గా సాగుతున్నట్టు నియోజకవర్గ ఇన్‌చార్జి గొరకపూడి చిన్నయ్యదొర అన్నారు. గురువారం సాయంత్రం స్థానిక సంపెంగతోటలో లక్ష్మీ గణపతి యూనియన్‌కు చెందిన పలువురు పార్టీ సభ్యత్వాలు స్వీకరించారు. కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు కాటంరెడ్డి ఏడుకొండలు పాల్గొన్నారు.

దేవీ నవరాత్ర ఉత్సవాల వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

పెద్దాపురం: అమ్మ దయ ఉంటే ప్రతి సంకల్పం సాధ్యపడుతుందని పారిశ్రామిక వేత్త, లలిత రైస్ ఇండస్ట్రీస్ అధినేత మట్టే శ్రీనివాస్ అన్నారు. స్థానిక భువనేశ్వరి పీఠంలో అక్టోబర్ మూడో తేదీ నుంచి నిర్వహించే దేవి నవరాత్రి ఉత్సవాల వాల్‌పోస్టర్‌ను గురువారం శ్రీనివాస్, విద్యులత దంపతులు ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా భువనేశ్వరీ పీఠాధిపతి చింతా గోపిశర్మ సిద్ధాంతి అధ్యక్షతన జరిగిన సమావేశంలో శ్రీనివాస్ దంపతులు పాల్గొని పీఠంలో ఏటా దేవి నవరాత్రులు నిర్వహించడం అభినందనీయమన్నారు.

కృష్ణాలయం వద్ద మహాన్నదానం

పెద్దాపురం: స్థానిక పాత బస్టాండ్ కృష్ణుడి ఆలయం వద్ద భారీ మహాన్నదానం నిర్వహించారు. కృష్ణాష్టమి వేడుకల ముగింపులో భాగంగా గురువారం నిర్వహించిన అన్నదానాన్ని మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, ఆప్కో మాజీ డైరెక్టర్ ముప్పన వీర్రాజు ప్రారంభించగా కమిటీ సభ్యులు దాకమూరి ఏడుకొండలు, కొత్త పవన్‌కుమార్, నాని, ఆనంద్, కిరణ్‌కుమార్, అజయ్, మణికంత, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబానికి భరోసా



నిరుపేద కుటుంబానికి నిత్యావసర సరకులు అందిస్తున్న భరోసా సంస్థ ప్రతినిధులు

సామర్లకోట: స్థానిక పాత తహసీల్దార్ కార్యాలయం వద్ద నివసిస్తున్న ఝాన్సీ భర్త ఇటీవల చనిపోవడంతో కుటుంబం ఆకలితో అలమటిస్తోంది. ఆమెకు ఒక కుమార్తు, కుమార్తె ఉన్నారు. కుమార్తు ప్రైవేటు స్కూల్‌లో ఐదవ తరగతి, కుమార్తె ప్రభుత్వ పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్నారు. విషయం తెలుసుకున్న స్థానిక భరోసా సంస్థ ప్రతినిధులు నెలకు సరిపడే నిత్యావసర సరకులు, ఝాన్సీ కుమారుడు చదువుతున్న ప్రైవేటు స్కూల్ ఫీజును చెల్లించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు శేషారెడ్డి, జీఎస్ఎన్ సతీష్, గంగాధర్, ఎ.నాగబాబు పాల్గొన్నారు.

నేతన్నలకు బోనస్, డివిడెండ్ల పంపిణీ



చేనేత కార్మికులకు చెక్కులు అందజేస్తున్న వీర్రాజు

పెద్దాపురం: సంక్షోభంలో ఉన్న చేనేత కార్మికులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని ఆప్కో మాజీ డైరెక్టర్ ముప్పన వీర్రాజు అన్నారు. స్థానిక చేనేత సహకార భవనంలో గురువారం కార్మికులకు బోనస్‌లు, డివిడెండ్లను ఆయన పంపిణీ చేశారు. సొసైటీ పర్సన్ ఇన్‌చార్జి సీహెచ్‌ఏవీ రవికుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో వీర్రాజు మాట్లాడుతూ సహకార సంఘాల ద్వారా విక్రయించే వస్త్రాలకు రిబేట్ ఇవ్వాలన్నారు. చేనేత సొసైటీలకు పావలా వడ్డీకి రుణాలివ్వాలని వీర్రాజు అన్నారు. రవికుమార్ మాట్లాడుతూ సొసైటీలో 237 మంది సభ్యులు ఉండగా వీరిలో వస్త్రాలు తయారు చేసే 47 మంది కార్మికులకు రూ.1,23,320 బోనస్‌గా వచ్చిందన్నారు. 237 మందికి రూ.1,08,057 డివిడెండ్ వచ్చిందన్నారు. అనంతరం వారికి వీర్రాజు చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మేనేజర్ తూతిక చంద్రశేఖర్, ఎం.చంద్రశేఖర్, టి.ప్రసాదరావు, చేనేత కార్మికులు పాల్గొన్నారు.

ఆక్రమణ నుంచి చెరువుకు విముక్తి



ఆక్రమణలను పరిశీలిస్తున్న తహసీల్దార్, ఇరిగేషన్ జేఈ, సర్వేయర్ తదితరులు

సర్వే చేసి హద్దులు గుర్తించిన అధికారులు

సామర్లకోట: స్థానిక సత్యనారాయణపురం, జగ్గమ్మగారిపేట ఇరిగేషన్ చెరువు ఆక్రమణకు గురైనట్టు అధికారులు గుర్తించారు. ఈ మేరకు గురువారం తహసీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి ఆ వివరాలను విలేకర్లకు తెలిపారు. ఈ ఆక్రమణలపై ఫిర్యాదుల మేరకు గత నెల 16వ తేదీన చెరువు పూడ్చివేత పనులను నిలిపి వేయించామన్నారు. చెరువు పూడ్చి లే అవుట్‌కు ప్రయత్నిస్తున్నారనే ఫిర్యాదుల మేరకు తమ సిబ్బందితో చెరువును అప్పట్లో పరిశీలించామని చెప్పారు. ఆ సందర్భంగా పూడ్చివేస్తున్న వ్యక్తి ఈ చెరువుపై తమకు హక్కులు ఉన్నాయని చెప్పడంతో రికార్డులు తీసుకురావాలని కోరామన్నారు. సదరు వ్యక్తి ఏ రికార్డులు సమర్పించకపోవడంతో ఆక్రమణగా నిర్ధారించి గురువారం నీటిపారుదల అధికారులకు సమాచారం ఇచ్చి చెరువు సంబంధిత రికార్డులతో హాజరు కావాలని సూచించినట్టు తెలిపారు. వారి రికార్డుల మేరకు చెరువు ఆక్రమణ వెలుగులోనికి వచ్చిందన్నారు. చెరువును ఆక్రమించి సాగు చేసుకుంటున్నట్లు సర్వేలో వెలుగులోనికి వచ్చింది. ఈ చెరువును ఇరిగేషన్ జేఈ వీరబాబు, మత్స్యకార సొసైటీ సభ్యులు గొర్రెల అప్పారావు, రమణ, అందుగుల జార్జి చక్రవర్తిల సమక్షంలో తహసీల్దార్ సర్వే చేయించారు. సర్వేయర్ సుబ్రహ్మణ్యం తన సిబ్బందితో చెరువు హద్దులను గుర్తిం మక్కులు ఏర్పాటు చేశారు. చెరువు రక్షణకు ఏర్పాట్లు చేసుకోవాలని తహసీల్దార్ ఇరిగేషన్ అధికారులకు సూచించారు. సర్వే నెంబరు 94–6 లోని 12.41 ఎకరాలను సర్వే చేయించి ఇరిగేషన్ ఏఈ వీరబాబుకు అప్పగించిన్నట్లు తహసీల్దార్ తెలిపారు.

పౌష్టికాహార మాసోత్సవాలు



తల్లులకు అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మానస



మూలపేటలో పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

పిఠాపురం: గొల్లప్రోలు మండలం చేబ్రోలులో గురువారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మానస ఆధ్వర్యంలో చేబ్రోలు అంగన్‌వాడీ కేంద్రంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లులకు ఆహ్వానం పలికిన ఐసీడీఎస్ సిబ్బంది అంగన్‌వాడీ కేంద్రంలో కొత్తగా పిల్లలను చేర్చుకుని తల్లులకు పౌష్టికాహార విలువలను వివరించారు. ఈ కార్యక్రమంలో తల్లులు, కిశోరబాలికలు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

కొత్తపల్లిలో..

కొత్తపల్లి: మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో గురువారం పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. వ్యాధి నిరోధక శక్తిని పెంచుకునేందుకు ఆకుకూరలు పళ్లు, గుడ్లు, పాలు, మాంసకృత్తులు ఉండే ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాలలో అందించే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

చవితి ఉత్సవాలకు ఎస్పీకి ఆహ్వానం

కాకినాడ: కాకినాడ దిగుమర్తి వారి వీధిలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించే వినాయక చవితి ఉత్సవాలకు కౌడా మాజీ చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళా దీప్తి జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్‌కు ఆహ్వానం అందజేశారు. గురువారం ఆమె ఆహ్వాన కమిటీ సభ్యులతో కలిసి ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఉత్సవ నిర్వహణకు సంబంధించి ఈ ఏడాది ధాన్యాలతో వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేయడంతో పాటు ఇతర వివరాలు తెలియజేసి ఆహ్వాన పత్రికను ఎస్పీకి అందజేశారు. కార్యక్రమంలో ఆమె వెంట పలువురు ఆహ్వాన కమిటీ సభ్యులు ఉన్నారు.

నిమజ్జనాలను విజయవంతం చేయాలి



వివిధ శాఖల అధికారులతో సమీక్షిస్తున్న ఆర్డీఓ కిశోర్

- ఆర్డీఓ కిశోర్
- ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో సమీక్ష

బోట్‌క్లబ్: వినాయక చవితి, గణేష్ నిమజ్జనాలను విజయవంతం చేయడానికి ప్రతి శాఖ అధికారులు కృషి చేయాలని ఆర్డీఓ ఇట్ల కిశోర్ అన్నారు. ఈ మేరకు ఏర్పాట్లు, భద్రతా చర్యలపై ఆయన తన కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. స్థానిక జగన్నాథపురం, కాకినాడ రూరల్ సూర్యారావుపేటలో ఏటా పెద్ద ఎత్తున గణేష్ నిమజ్జనాలు జరుగుతున్నందున అధికారులు ఏర్పాట్లు చేయాలన్నారు. తాగునీరు, విద్యుత్, పారిశుధ్యం, భారీ క్రేన్లు, గజ ఈతగాళ్లు, భద్రత తదితర అంశాలపై ఆయా శాఖల అధికారులకు సూచించారు. ఈ సమాచారాన్ని ఉత్సవ నిర్వాహకులకు, కమిటీలకు సూచించాలన్నారు. డీఎస్పీ రఘువీర్ విష్ణు మాట్లాడుతూ నిర్దేశించిన ప్రాంతంలో మాత్రమే నిమజ్జనాలు చేయాలని ఉత్సవ నిర్వాహకులను కోరారు. సమావేశంలో మున్సిపల్ డీఈ మాధవి, నగర గణేష్ ఉత్సవ కమిటీ గౌరవ అధ్యక్షుడు దూసర్లపూడి రమణరాజు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రంగరాయ వైస్ ప్రిన్సిపాల్‌కు ఘన వీడ్కోలు

కాకినాడ క్రైం: స్థానిక రంగరాయ వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్ (అకడమిక్స్), కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ బి.దేవీ మాధవికి అధికారులు, సహాధ్యాపకులు గురువారం ఘనంగా వీడ్కోలు పలికారు. ఆమె విజయనగరానికి బదిలీపై వెళ్తున్న నేపథ్యంలో ఆర్ఎంసీ వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఏ.విష్ణువర్ధన్, కమ్యూనిటీ మెడిసిన్ డిపార్ట్‌మెంట్ సంయుక్త ఆధ్వర్యంలో జీజీహెచ్‌లోని ఎస్‌పీఎం గ్యాలరీలో సత్కారం చేశారు. కార్యక్రమానికి డాక్టర్ వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ వీసీ, రాష్ట్ర వైద్య విద్యా సంచాలకుడు, ఆర్ఎంసీ ప్రిన్సిపల్ డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం ముఖ్య అతిథిగా హాజరై మాధవి వృత్తి నైపుణ్యాన్ని కొనియాడారు. కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాసన్, వివిధ విభాగాల హెచ్‌వోడీలు పాల్గొన్నారు.

పురస్కార గ్రహీతలకు సత్కారం



పురస్కార గ్రహీతలు, మండల విద్యాశాఖ సిబ్బందిని సత్కరిస్తున్న ఎంఈఓ 2 పుల్లయ్య



జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న శ్రీనివాసు



సర్వేపల్లి రాధాకృష్ణ విగ్రహాన్ని ఆవిష్కరించిన చైర్‌పర్సన్ అరుణ, ఉపాధ్యాయులు

సామర్లకోట: జిల్లా స్థాయి అవార్డులు అందుకున్న ఉత్తమ ఉపాధ్యాయులను మండల విద్యాశాఖాధికారి–2 పి.పుల్లయ్య ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం సత్కరించారు. మండల పరిధిలోని ఎలిమెంటరీ పాఠశాలలకు చెందిన అద్దంకి వెంకన్నబాబు, కె.రాంబాబు చౌదరి ఎంపికైన విషయం తెలిసిందే. కాకినాడలో అవార్డులు అందుకున్న వారిని మండల విద్యా శాఖ కార్యాలయంలో సత్కరించారు. ఇందులో భాగంగా మండల విద్యాశాఖా కార్యాలయంలో పని చేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్ సుబ్రహ్మణ్యం, ఎంఐఎస్ జి.ప్రశాంతి, అకౌంటెంట్ రామకృష్ణ, రిసోర్సు పర్సన్లు ఎ.వీర్రాజు. కె.ఉమామహేశ్వరరావు, ఎం.శ్రీనివాసరావు, కె.తనూజ, కె.నాగమణిలను ఎంఈఓ సత్కరించారు.

విద్యాలోకానికి ఆదర్శం సర్వేపల్లి

ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ, వార్డు కౌన్సిలర్ బలుసు వాసు ఆధ్వర్యంలో గురు పూజోత్సవం నిర్వహించారు. హెచ్ఎం సాయిరామకృష్ణ, పాఠశాల ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ అక్కిన చక్రధర్, మాజీ చైర్మన్ నక్కా జానకి రామారావు, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ అడబాల కుమారస్వామి, వల్లూరి గాంధీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విగ్రహం ఆవిష్కరణ

సర్వేపల్లి రాధాకృష్ణ ఆశయాలు నిత్యం ఉపాధ్యాయులకు, విద్యార్థులకు గుర్తు వస్తాయని మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ అన్నారు. స్థానిక బచ్చుఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్ విశ్రాంత పీడీ తాళ్లూరి వైకుంఠం పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సర్వేపల్లి విగ్రహాన్ని గురువారం ఆమె ఆవిష్కరించి నివాళులు అర్పించారు. విగ్రహాన్ని ఏర్పాటు చేసిన వైకుంఠం, పాఠశాల ఉపాధ్యాయినిగా ఉన్న ఎఎల్‌వీ కుమారి దంపతులను చైర్‌పర్సన్ సత్కరించారు. హెచ్ఎం తోటకూర సాయి రామకృష్ణ, ఉపాధ్యాయులు, కౌన్సిలర్ బలుసు వాసు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో

సామర్లకోట: స్థానిక లయన్స్ క్లబ్ భవనంలో జిల్లా గవర్నర్ ఈదల ఈశ్వర్‌కుమార్ విశ్రాంత ఉపాధ్యాయులను సత్కరించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఎస్ఆర్‌వైవీఆర్ ప్రసాద్ అధ్యక్షత వహించగా, లయన్స్ క్లబ్ మాజీ గవర్నర్ లింగమల్లు కృష్ణమూర్తి, జిల్లా చైర్మన్ మేకా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

శ్రీనివాస్‌కు ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం

కొత్తపల్లి: మండలంలోని కొండెవరం జిల్లా పరిషత్ పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయుడు గారపాటి శ్రీనివాసు ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాన్ని గురువారం జిల్లా కలెక్టర్ షణ్మోహన్ చేతుల మీదుగా అందుకున్నారు. ఆయనను సహోపాధ్యాయులు అభినందించారు.

గురువును గుండెల్లో పూజించాలి



కుతుకుడుమిల్లిలో సర్వేపల్లి చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న అంగన్‌వాడీ, విద్యార్థులు

కొత్తపల్లి: ప్రతి ఒక్కరికీ తల్లిదండ్రుల తరువాత విద్య నేర్పేది గురువేనని, ఆయనను ఎల్లప్పుడూ గుండెల్లో పెట్టుకుని పూజించాలని అంగన్‌వాడీ కార్యకర్త కర్రి సుబ్బలక్ష్మి అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం మండలంలోని కుతుకుడుమిల్లి శివారు నిదానందొడ్డిలోని అంగన్‌వాడీ కేంద్రంలో సర్వపల్లి రాధాకృష్ణన్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.